క్లుప్తంగా

బ్యాంకు క్యాషియర్‌కు సన్మానం


శివను సన్మానిస్తున్న గ్రామస్తులు

బోథ్: సొనాల గ్రామంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గత ఆరు సంవత్సరాలుగా క్యాషియర్‌గా విధులు నిర్వహిస్తున్న శివ ఇటీవల బదిలీ కావడంతో ఆయనను శుక్రవారం గ్రామస్తులు, ఐకేపీ సిబ్బంది శాలువాతో ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఐటీడీఏ మాజీ డైరెక్టర్ మేస్రం భూమన్న, హ్యూమన్ రైట్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి చందేల్ ప్రతాప్ సింగ్, నేతకాని మహర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కాంబ్లే భీమ్ రావు, జాదవ్ సునీత రోహిదాస్, మెస్రం దత్తు, బ్యాంక్ మేనేజర్ నరేందర్, ఐకేపీ వీవోఏ పవార్ శ్యాంరావ్, కార్యదర్శి రవీందర్, సభ్యులు సంగ్రామ్, మణిక్‌రావ్ తదితరులు ఉన్నారు.

బాలికలు చదువులో ఉన్నతంగా రాణించాలి


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

తాంసి: బాలికలు చదువుతో పాటు అన్ని రంగాల్లో ఉన్నతంగా ఎదగాలని తాంసి వైద్యాధికారి స్రావ్య సూచించారు. శుక్రవారం మండలంలోని పొన్నారి ప్రాథమిక పాఠశాలలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పఢావో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. మహిళలు, బాలికల హక్కులను సైతం వారికి తెలియజేసి వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికారత కోఆర్డినేటర్ యశోద, వైద్యసిబ్బంది సంపత్ కుమారి, ఏఎన్ఎం లక్ష్మి, అంగన్‌వాడీలు గంగమ్మ, దేవమ్మ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: విద్యుత్ సరఫరాలో శనివారం అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్ చౌహాన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని భుక్తాపూర్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. పట్టణంలోని భాగ్యనగర్, భుక్తాపూర్, వడ్డెర కాలనీ, క్రాంతినగర్, మహాలీవాడ, చిల్కూరి లక్ష్మీనగర్, జైజవాన్ నగర్, గాంధీ చౌక్, అంబేద్కర్ చౌక్, శివాజీ చౌక్, రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. సీసీఐ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా జీఎస్ ఎస్టేట్, తిర్పెల్లి, బద్కు మొహల్లా, బ్రాహ్మణవాడ, పంజేషా ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. రిమ్స్ సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ల మరమ్మతు కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, సంజయ్‌నగర్, టీచర్స్ కాలనీ, పాత హౌజింగ్ బోర్డుకాలనీ, ఫిల్టర్‌బెడ్, కలెక్టర్ చౌక్ ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

హాస్టల్‌ను తరలించొద్దని వినతి

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఉన్న బీసీ హాస్టల్‌ను తరలించవద్దని వసతిగృహం విద్యార్థులు కోరారు. ఈమేరకు శుక్రవారం జిల్లా అదనపు కలెక్టర్ శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. క్యాంపస్‌లోని హాస్టల్‌లో అన్ని సౌకర్యాలు ఉన్నప్పటికీ వేరే చోటుకు తరలించారన్నారు. తద్వారా కళాశాలకు, వసతిగృహానికి దూరంగా ఉండటం వల్ల రవాణా చార్జీలు అదనపు భారంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి హాస్టల్‌ను యథావిధిగా కొనసాగించాలని కోరారు.

అక్రమాలకు పాల్పడితే చర్యలు


రేషన్‌బియ్యాన్ని పరిశీలిస్తున్న డీటీ త్రియంబక్‌రావు

ఉట్నూర్‌రూరల్: మండలంలోని సుద్దగూడలో శివశక్తి గ్రూప్ ఆధ్వర్యంలో నడుస్తున్న రేషన్ షాపును శుక్రవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ త్రియంబక్ రావు తనిఖీ చేశారు. తనిఖీలో 110 క్వింటాళ్ల బియ్యం తక్కువ రావడంతో కేసు నమోదు చేశామన్నారు. రేషన్‌బియ్యాన్ని అర్హులైన ప్రతీ లబ్ధిదారుడికి అందేలా చూడాలని, అక్రమాలకు పాల్పడితే నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

వ్యాధుల కాలం.. జర పైలం

- పొంచి ఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి..
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

సిరికొండ: వానాకాలం అపరిశుభ్రత కారణంగా గ్రామాల్లో, పట్టణాల్లో దోమలు, ఈగలు రాజ్యమేలుతాయి. వీటి వ్యాప్తితో చిన్న, పెద్ద తేడా లేకుండా అందరూ రోగాలతో మంచం పడుతుంటారు. వ్యాధుల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

దోమల వ్యాప్తి ఎక్కువ..

వానాకాలంలో వర్షపు నీరు ఎక్కడ పడితే అక్కడ నిల్వ ఉంటుంది. నిల్వ నీటిలో దోమలు, ఈగలు వృద్ధి చెందుతాయి. దోమల వల్ల మలేరియా, టైఫాయిడ్ జ్వరాలు వచ్చి కొందరు మృత్యువాత పడుతున్నారు. గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో పెరుగుతున్న పిచ్చి మొక్కలు, మురుగు కాలువలు సైతం దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమలు వ్యాప్తి చెందకుండా ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. వారానికి ఒకరోజు డ్రైడే నిర్వహించాలి. దోమలు కుట్టకుండా దోమ తెరలు వాడాలి. అనారోగ్యం బారిన పడిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

గ్రామ పంచాయతీల్లో చర్యలు..

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టారు. దోమలను చంపేందుకు బయో లర్వాలను మురికి కాల్వల్లో, నిల్వ నీరు ఉన్న గుంతల్లో పిచికారీ చేస్తున్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు బ్లీచింగ్ చల్లుతున్నారు.

ఇవి పాటించాలి..


సిరికొండలో దోమల మందు పిచికారీ చేస్తున్న పంచాయతీ సిబ్బంది

- క్లోరినేషన్ చేసిన నీటిని, కాచి చల్లార్చిన నీటినే తాగాలి.
- క్లోరినేషన్ మాత్రలను తాగునీటి బిందెల్లో వేసి తాగాలి.
- పరిసరాల్లో పిచ్చిమొక్కలు లేకుండా, చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలి.
- దోమ తెరలు వాడాలి.
- వేడి ఆహారం తీసుకోవాలి.

డ్రైడే నిర్వహిస్తున్నాం



మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రతీ శుక్ర, మంగళవారం రోజుల్లో డ్రైడే నిర్వహిస్తున్నాం. అన్ని గ్రామాల్లో దోమల మందు పిచికారీ చేశాం. మంచి నీటి బావుల్లో, వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేశాం. పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగుతున్నాయి.

– సంతోష్, ఎంపీవో

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



మన చుట్టూ ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వర్షాకాలంలో కాచిచల్లార్చిన నీటిని తాగాలి. జ్వరం వస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలి. గ్రామాల్లో సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తాం.

– ప్రతాప్ నాయక్, పీహెచ్‌సీ వైద్యుడు, పిట్టబొంగారం

- కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి.
- ఇంటి ఆవరణలో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలి.

మానవ మనుగడకు చెట్టే జీవనాధారం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు


మొక్కలు అందజేస్తున్న అధికారులు


విద్యార్థులతో కలిసి మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూర్‌రూరల్: మానవ మనుగడకు చెట్లే జీవనాధారమని ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ ఆవరణలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ బాలికల కళాశాలలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా అధికారులు, విద్యార్థులు, మండల నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ చెట్లతోనే మానవ జీవనం ముడిపడి ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణకు పచ్చదనాన్ని పెంపొందించేందుకు వన మహోత్సవ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు.

బోథ్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఎంపీడీవో రమేశ్ అన్నారు. మండలంలోని కనుగుట్ట గ్రామంలో శుక్రవారం గ్రామస్తులకు మొక్కలు అందించారు. ప్రతీ కుటుంబానికి ఆరు మొక్కలను పంచాయతీల ద్వారా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. మొక్కలను పెంచితే పర్యావరణంలో సమతుల్యం ఉంటుందన్నారు. ఏపీవో జగ్గయ్యరావు, పంచాయతీ కార్యదర్శి డి.గంగయ్య, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఇంద్రవెల్లి: వన మహోత్సవంలో భాగంగా నాటే ప్రతీ మొక్కను సంరక్షించడానికి కృషి చేయాలని ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకం ఏపీవో జాదవ్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, దనోరా, శంకర్‌గూడ గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రభుత్వ స్థలాల్లో, ప్రభుత్వ కార్యాలయాల పరిసర ప్రాంతాలతో పాటు రోడ్లకు ఇరువైపుల మొక్కను నాటే కార్యక్రమాన్ని వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్‌లు మహేందర్, సంతోష్ జైస్వాల్, విఠల్, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

నార్నూర్: పర్యావరణ పరిరక్షణ మొక్కలతోనే సాధ్యమని ఎన్ఆర్ఈజీఎస్ జిల్లా అధికారిని వీణ అన్నారు. శుక్రవారం మండలంలోని గంగాపూర్ గ్రామశివారులో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. టీఏ జాదవ్ కైలాష్ నాయక్ తదితరులు ఉన్నారు.

నేరడిగొండ: చెట్లతోనే మానవ మనుగడ సాధ్యమని మండల ప్రత్యేక అధికారి రవీందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని కుమారి గ్రామంలో పర్యటించారు. సీజనల్ వ్యాధుల నివారణ కోసం మురికి కాల్వల్లో బ్లీచింగ్ చల్లే కార్యక్రమాన్ని చేపట్టారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఇంటింటా మొక్కలు పంపిణీ చేశారు. జెడ్పీఎస్ఎస్ పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో రాజ్‌వీర్, ఎంపీవో లక్ష్మణ్, ఈజీఎస్ ఏపీవో వసంత్‌రావు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.


నార్నూర్: మొక్కలు నాటుతున్న వీణ

తాంసి: భీంపూర్ మండలంలోని అంతర్గాం గ్రామంలో శుక్రవారం ఇంటింటా మొక్కల పంపిణీ చేపట్టారు. వన మహోత్సవంలో భాగంగా పంచాయతీ కార్యదర్శి నర్సయ్య ట్రాక్టర్ ద్వారా ప్రతీ ఇంటికి మొక్కలను అందజేశారు.


తాంసి: అంతర్గాంలో..


నేరడిగొండ: కుమారి గ్రామంలో..


ఇంద్రవెల్లి: ముత్నూర్‌లో..

ఉట్నూర్ డిపోలో బస్సులు పెంచాలి

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ డిపోలో బస్సుల సంఖ్య పెంచాలని బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు నానా తంటాలు పడుతున్నారని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఉట్నూర్ డిపో కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ మంచిర్యాల నుంచి ఆదిలాబాద్‌కు సాయంత్రం 6గంటల తర్వాత బస్సు సౌకర్యం లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఉట్నూర్ నుంచి నిర్మల్‌కు ఒక్క బస్సు కూడా లేదన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్వీ నాయకులు

నాయకులు ముజీబ్, సిడాం సోనేరావు, సాసిద్, సిడాం లచ్చు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

ఉట్నూర్‌రూరల్: ఆదివాసీ హక్కుల నేత, ఆదివాసీల తొలితరం ఉద్యమకారుడు సిడాం శంభు వర్ధంతి విజయవంతం చేయాలని ఆదివాసీ నాయకులు పోస్టర్ ఆవిష్కరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రెస్‌భవన్‌లో మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, శంభు తనయుడు సిడాం లచ్చు పటేల్, సిడాం సోనేరావు, సిడాం శేషుల ఆధ్వర్యంలో ఈ నెల 20న నిర్వహించనున్న శంభు వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కోసుబాయి, తిరుపతి, మోతీరాం, లక్ష్మణ్, జుగాదిరావు, సాజిద్‌లు పాల్గొన్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించిన ఎస్సై

తిర్యాణి: మండలంలోని మంగి పంచాయతీ పరిధిలోని కోలంగూడ, పాతగూడ, శ్రీరాంపూర్‌గూడ గ్రామానికి చెందిన బడీడు పిల్లలను ఎస్సై రమేశ్ బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ఎస్సై రమేశ్ మాట్లాడుతూ ఉమ్మడి మంగి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన బడీడు పిల్లలు బడులకు వెళ్లకుండా పనులకు వెళ్తున్నారని గుర్తించామన్నారు. వారి తల్లిదండ్రులకు పోలీసుల ఆధ్వర్యంలో ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి 8 మంది విద్యార్థులను శుక్రవారం తిరిగి బడిలో చేర్పించినట్లు ఎస్సై పేర్కొన్నారు.


విద్యార్థుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఎస్సై రమేశ్

ఎస్సీ కాలనీలో చేతిపంపు ఏర్పాటు


చేతిపంపు వద్ద మహిళలు

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజల తాగునీటి సౌకర్యం కోసం శుక్రవారం బాల వికాస సహకారంతో చేతిపంపు ఏర్పాటు చేశారు. కాలనీవాసులు గత కొన్ని నెలలుగా తాగునీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీటి సమస్య గురించి స్థానిక ఎమ్మెల్యేతో పాటు నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే సహకారంతో రూ. 50వేల ఖర్చుతో చేతిపంపు ఏర్పాటు చేయడంతో కాలనీవాసుల కష్టాలు దూరమయ్యాయి.

విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోండి

నార్నూర్: ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని డీఎల్‌పీవో ప్రభాకర్ అన్నారు. శుక్రవారం గాదిగూడ మండలంలోని అర్జునిబాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఝరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ సంజీవ్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని పరిశీలించారు. పాఠశాలలో వంటగదిని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు నివాసం ఉండే డార్మెంటరీల చుట్టూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆరోగ్య సమస్యలు ఉంటే ఎప్పటికప్పుడు వైద్యులకు సమాచారం అందించాలన్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో రమేశ్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంజీవ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ వందన తదితరులు ఉన్నారు.

కేజీబీవీ సందర్శన..

తాంసి: కేజీబీవీలో చదివే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తాంసి మండల ప్రత్యేకాధికారి సీపీవో వెంకటరమణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీని ఎంపీడీవో మోహన్‌తో కలిసి పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యతో పాటు హాజరు శాతం, వసతుల కల్పనను ప్రత్యేకాధికారి సౌజన్యను అడిగి తెలుసుకున్నారు. కొనసాగుతున్న మరమ్మతు పనులతో పాటు శానిటేషన్, తాగునీటి వసతిని పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రాంగణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఎంపీవో స్వప్నశీల, సిబ్బంది శ్రీవిద్య, సంగీత ఉన్నారు.


వంటగది పరిశీలిస్తున్న డీఎల్‌పీవో ప్రభాకర్

నీటి నిల్వలు లేకుండా చూడాలి

ఇచ్చోడ: ఇంటి చుట్టూ, పరిసర ప్రాంతాల్లో వర్షం నీటి నిల్వలు ఉండకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని ముఖరా(కె)లో పర్యటించారు. డ్రైడే సందర్భంగా పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం పల్లె ప్రకృతివనం, సామూహిక మరుగుదొడ్లు, సోలార్‌ప్లాంట్, జీపీభవనం పరిశీలించారు. వంద శాతం ప్రభుత్వ పథకాలు అమలు చేస్తున్న ముఖరా(కె) గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఆయన వెంట నేరడిగొండ ఏవో భాస్కర్, ముఖరా(కె) మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాష్, గ్రామస్తులు పాల్గొన్నారు. మండలంలోని బోరిగామలో నిర్వహించిన డ్రైడేలో ఎంపీడీవో లక్ష్మణ్ పాల్గొని అవగాహన కల్పించారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి

ఇంద్రవెల్లి: వర్షాకాలంలో ప్రజలు వైద్యాధికారుల సూచనలు పాటించి అప్రమత్తంగా ఉండాలని ఇంద్రవెల్లి ప్రభుత్వ ఆస్పత్రి హెల్త్ సూపర్‌వైజర్ వినోద్ అన్నారు. శుక్రవారం డ్రైడే కార్యక్రమంలో భాగంగా మండలంలోని దనోరా.బి, దేవపూర్ తదితర గ్రామాల్లో ఇంటింటిని సందర్శించి పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తిరుపతమ్మ, రమ, ఇందు తదితరులు ఉన్నారు.


ముఖరా(కే)లో నీటి నిల్వలు తొలగిస్తున్న సిబ్బంది

బేల: మండలంలోని బాది గ్రామంలో శుక్రవారం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డ్రైడే, వైద్య శిబిరం నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి శంకర్, వైద్యాధికారి వంశీ కృష్ణలు ఇంటింటా తిరుగుతూ కుండీలలో, డబ్బాలలో, కూలర్లలో నిల్వ ఉన్న నీళ్లు తొలగించారు. మాజీ సర్పంచ్ వినోద్, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తా


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. శుక్రవారం తలమడుగు మండలంలోని చెర్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన సవారి బంగ్లా షెడ్డు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని వాటి పరిష్కారానికి అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని పేర్కొన్నారు. గ్రామంలో ఎక్కడ ఏ చిన్న సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల కన్వీనర్ తోట వెంకటేష్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, కేదరేశ్వర్‌రెడ్డి, కాటిపల్లి శ్రీనివాస్ రెడ్డి, అభిరామ్‌రెడ్డి, జనక్ పటేల్, అబ్దుల్లా, రమకాంత్, ప్రమోద్, ప్రకాశ్‌రెడ్డి, రాంబాయి, పల్లవి, లక్ష్మణ్, నరసింహులు, రాంరెడ్డి, నారాయణరెడ్డి, తిరుమల గౌడ్, విజయ్, తదితరులు పాల్గొన్నారు.


గణేశ్ రెడ్డిని సన్మానిస్తున్న గ్రామస్తులు

తలమడుగు: గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ ధ్యేయమని తాజా మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కజ్జర్ల గ్రామంలో పదవీకాలం ముగిసిన తాజా జెడ్పీటీసీ, ఎంపీపీలను శాలువా కప్పి సన్మానించారు. గణేశ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. మాజీ జెడ్పీటీసీ బాబన్న, జైభరత్‌రెడ్డి, పోశెట్టి, స్వామిరెడ్డి, రాకేశ్, గంగన్న, జీవన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఎదులాపురం: రాంనగర్ ఎంపీపీఎస్‌లో పని చేస్తున్న ఉపాధ్యాయులు షంషీర్‌ఖాన్, భాస్కరరావు, రవీందర్‌రెడ్డిలు బదిలీ, పదోన్నతిపై ఇతర పాఠశాలలకు వెళ్తుండగా తోటి ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారిని సన్మానించారు. ఇందులో ఆదిలాబాద్ ఎంఈవో జయశీల, కాంప్లెక్స్ హెచ్ఎం అనురాధ, స్కూల్ హెచ్ఎం కాశీరాం, సీఆర్పీ జావిద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో పచ్చని శోభ



బోథ్: మండలంలోని సొనాల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన గార్డెన్ అందరిని ఆకట్టుకుంటుంది. గతంలో నాటిన మొక్కలు పెరగడంతో ఆరోగ్య కేంద్రం చిన్నపాటి పార్కుగా దర్శనమిస్తోంది. కాగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సుందరంగా తీర్చిదిద్దిన వైద్యులు నవీన్ రెడ్డిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.